# జిహ్వాచాపల్యం

"'ద్రాక్షాపానక ఖండశర్కరలతో, రంభాఫల శ్రేణితో,
గోక్షీరంబులతోడ, మండెగలతో, క్రొన్నేతితో, పప్పుతో,
నక్షయ్యంబగు నేరుబ్రాల కలమాహారంబు నిశ్శంకతన్
కుక్షుల్ నిండగ నారగించితిమి యక్షుద్ర క్షుధా శాంతికిన్.'

"అలా భీమేశ్వరఖండంలో చెప్పినా శ్రీనాధుడికి తృప్తి కలగ లేదు. తన కాశీఖండంలో భక్ష్య భోజ్య చోష్య లేహ్య పానీయముల వైవిధ్యములనిలా వివరించాడు..."

"బాగా తిండిపోతులాగున్నాడే శ్రీనాధుడు, సార్!" అన్నాడో విద్యార్థి, కుంటి సందేహం వెలువరిస్తూ.

'నిన్ను గురించికూడ చెప్పాదురా! ఆయన భోజనప్రియుడే సందేహం లేదు. అయితే ఆయనకు భోజనంలోకి అన్నీ అనువుగా ఉండాలి. సహపంక్తిని కూర్చున్న వారిపై పరిహాసోక్తులు కూడా కురిపించేవాడు. నీలాంటివాడే ఆయన పక్కన కూర్చుని భోజనం చెస్తున్నాడట! తాటికాయంత ముద్దలు తింటున్నాడట! 'తద్కబళ చాతురి తాళఫల ప్రమాణమున్'- అన్నాడు శ్రీనాథుడు. దేవుఁడి దయవల్ల పాడీపంటా సమృద్ధిగా ఉండబట్టిగానీ, లేకపోతే అతని 'భోజన పరాక్రమా'నికి కొంపగుల్లయి పోయేది....."

అతడికి కవిసార్వభౌముడు శ్రీనాధుడంటే మహా ఇష్టం. అతడు మహాభోజన ప్రియుడు. అలాంటి వాడే పరాంకుశం కూడ. తెలుగు సాహిత్యాన్ని మథించటానికీ, అందునా శ్రీనాధుని పై పరిశోధనచెయ్యటానికీ అతని చక్కటి శాకపాకాల వర్ణనే కారణం.

అలా పరాంకుశం పరవశుడై, కడుపు నిండుగ భోజనం చేసినట్టు సంతోషాబ్ధి ఓలలాడుతూ పాఠం చెబుతుండగా, సెల్‌ఫోను గణగణమని మోగింది.ఫోను జేబులో పెట్టుకు తిరిగేది మాట్లాడటానికే అని పరాంకుశం దృఢ విశ్వాసం. ఫోను చేస్తే ఎత్తి మాట్లాడని మనుషులంటే అతనికి చిరాకు. కనుక తప్పక, క్లాసు బయటకు వచ్చి, సెల్ ఆన్ చేశాడు.

అవతల ఫోనులో మాట్లాడుతున్నది తన బావగారు రామానుజం.

రామానుజం వృత్తి రీత్యా సైంటిస్టు. పది, పదిహేనేళ్ళు అమెరికాలో ఉండి వచ్చాడు. అతనికిద్దరు పిల్లలు. వాళ్ళ చదువులు కూడా అయి పోయాయి; పెళ్ళిళ్ళు చేసుకుని జీవితంలో సెటిలవటమే అన్న తరుణంలో ఎక్కడ పిల్లలు అక్కడ ప్రేమలో పడి, తన వంశానికిమచ్చ తెస్తారోనని భయపడి, మళ్ళా ఇక్కడ ఫాట్ శాలరీతో నౌకరీ దొరికే అవకాశంలభించటంతో మన సంస్కృతిని కాపాడ బద్ధకంకణుడై అతడు ఇండియాకు తిరిగి వచ్చాడు. హైదరాబాదులో సెటిలయాడు.

"కీర్తి కేదో సంబంధం వచ్చింది. నువ్వు వచ్చి ఆ పిల్లవాడిని అప్రూవ్ చేస్తేగానీ, నాకు తృప్తిగా ఉండదయ్యా!" అని చెప్పాడు రామానుజం.

"నేనెందుకులెండి, బావగారూ! ఓ స్వీటెక్కువ తిన్నా, ఓ మాటెక్కువ మాట్లాడినా అక్కయ్యకు కోపమొస్తుంది" అన్నాడు పరాంకుశం.

"ఇదేం మాటోయ్, పిల్ల మేనమామగా నీకా బాధ్యత లేదూ? మారు మాట్లాడక రేపు పొద్దున్నే వచ్చెయ్. ఇక్కడే భోంచెయ్యొచ్చు."

"రేపు వర్కింగ్‌డే నండీ, కాలేజీ కెళ్ళద్దూ?" అన్నాడతను.

"శలవు పెట్టెయ్యవయ్యా, ఒక్క రోజుకేం మునిగి పోయేది లేదు. ఇంగ్లీషు మీడియంలు మెదలెట్టి అసలు తెలుగునే ఆంధ్రప్రదేశ్ నుండి బహిష్కరించాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే నీ గోలేంటి? కనీసం ఒక్క రోజుకయినా పిల్లలు బాగుపడి పోతారు" అన్నాడు రామానుజం.

"మీ జోకు దారుణం బావగారూ! నామీద కోపముంటే తీర్చుకునే విధానం ఇది కాదు. మధ్యలో తెలుగేం చేసింది. సర్లేండి, ఇంటికి అల్లుడిగా తెచ్చుకున్నాక ఎలాంటి మనిషయినా భరించక తప్పదు" అని రావటానికి అంగీకరించి, "మా అక్కకోసారి ఫోనివ్వండి" అని, ఫోను అరుంధతి చేతి కొచ్చాక, "బావగారు అనవసరంగా ఇన్నిమాటలూ మాట్లాడి అసలు పెళ్ళి చూపులెప్పుడో చెప్పనేలేదు. ఆయనకు మతిమరపు ఎక్కువైనట్టుందే అక్కా! సైంటిష్టు కదూ! పాపం ఆయనతో నువ్వెలా వేగుతున్నావో మరి!"

"నా సంగతి సరే! అదేదో నేను చూసుకుంటాను. పెళ్ళి చూపులు మూడింటికి. నువ్వు పెంద్రాడే వచ్చెయ్యి" అంది అరుంధతి.

"భోజనం టైముకొచ్చేస్తాగా? స్వీట్లూ వగైరా మంచి షాపులో తెప్పించండి. పుల్లారెడ్డి షాపయితే బాగుంటుంది. మనమే విషయంలోనూ లోపం చెయ్య కూడదు. ఎండాకాలం వస్తోంది, మంచి మామిడి పండ్లు కూడ దొరుకుతున్నాయి! ఇంతకీ పిల్లవాడేం చదివాడు,

ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడు, తల్లి దండ్రులెవరు, ఏ ఊరివాళ్ళు వగైరా విషయాలేమీ చెప్పకుండా, 'కీర్తి కేదో సంబంధం వచ్చింది.నువ్వు రావాలోయ్' అంటే సరి పోతుందా? తొందర మనిషి. నువ్వేం బాధ పడకే! నేను వచ్చి అన్నీ వివరంగా కనుక్కుంటాగా! సరే, భోజనంలోకి ఏం చేస్తున్నావ్? పనస పొట్టు దొరుకుతున్నదా? ఆవపెట్టి కూర చేస్తే బ్రహ్మాండంగా వుంటుంది. మామిడి కాయ పప్పు చెయ్యి. ఆవకాయ ఎలాగో ఉంటుంది కనుక సింపుల్‌గా లాగించేద్దాం. ఏమంటావు?"

'నీ బొంద! నీ తిండియావ పాడుగాను! ఏదో ఒకటి తగలెడతాలే, నువ్వు టైముకు తగలడు!" అని ఆశీర్వదించింది అక్క

"తప్పు, అలాంటి పాడు కూతలు కూయకు. 'అన్నం పరబ్రహ్మ స్వరూపమ'ని నాన్న చెప్పటం మర్చిపోయావా? బావగార్ని ఆ అరేంజిమెంట్లన్నీ చూడమను. నేను సైంటిష్టునని నీలిగి కూర్చుంటే కూతురి పెళ్ళి కావటం కష్టమని చెప్పు. నేను పనులన్నీ పూర్తి చేసుకుని వీలయినంత త్వరగా వస్తానని చెప్పు. సరే, ఉంటా..."

అలా ఫోను రక్కున పెట్టెయ్యటానికి కారణం అక్కతో మాట్లాడటం అయిపోయి కాదు. ఎదురుగా కాలేజీకల్లా ఏకైక విలన్ నిలబడున్నాడు. 'తోడబుట్టింది ఫోను చేసింది కదా! రెండు నిముషాలు కూడా ఫోనులో మాట్లాడుకోనివ్వడు. ఎక్కడ నుండి చూస్తాడో త్రాష్టుడు! వెంటనే వచ్చి తగలడతాడు' అనుకున్నాడు పరాంకుశం. అయితే, ఆయన్ని ఎలా బుట్టలో వేసుకోవాలో పరాంకుశానికి బాగా తెల్సు.

"అయిపోయిందా? పనస పొట్టు ఆవపెట్టి కూర చేస్తే బ్రహ్మాండంగా వుంటుందా? ఆవకాయతో సింపుల్‌గా లాగించేద్దామంటావు! ముక్కా డొక్కా అక్కర్లా? పిల్లలకు పాఠాలు చెప్పేదుందా? ఫోనొస్తే గంటలు మాట్లాడతావు! నీకొక సారి వార్నింగిచ్చా. అయినా నీకు లెక్కలేదు. ఇంక లాభం లేదు. నీ మీద డిసిప్లినరీ ఏక్షను తీసుకోవల్సిందే! ఊర్కుంటే పెట్రేగి పోతున్నావు!" అన్నాడు అగ్గిమీద గుగ్గిలమవుతూ ప్రిన్సిపాల్.

"ఊర్కోండి, సార్, జోకులేస్తారు. మా మేనగోడలికి పెళ్ళిచూపులంట!.'మా ప్రిన్సిపాల్ సార్‌ని పిలిస్తేగాని నేను రాలేన'న్నాను. 'అతనెందుకోయ్! పెళ్ళికి పిలుద్దాంలే' అన్నాడు మా బావగారు. 'అల్లా కుదర్దండి. మా కాలేజీలో ఎవరి ఇంట్లో ఏం జరిగినా ఆయన ఆశీర్వాదం లేకుండా జరగదు. నాకు ఆయన ఆరాధ్యదైవం' అన్నాను. మీ మెప్పుకోసం మీ ముఖంమీద మాట్లాడే మాటలు కావు. నా గుండె లోతుల్లోనుంచి వచ్చినవి. మీరు ఇంటి కొస్తే కనీసం రెండు పదార్థాలయినా బాగుండాలా? అందుకే పనస పొట్టు ఆవ కూర, మామిడి కాయ పప్పు చెయ్యమన్నాను. మీరు ముక్కాగిక్కా తినరు కనుక వాటి విషయం చెప్పలేదు మా అక్కకి..."ఆ దెబ్బతో దిమ్మతిరిగి పోయింది ప్రిన్సిపాలుకు.

"రేపు విసి ఆఫీసులో పరీక్షల సెంటర్ల విషయమై మీటింగుందోయ్. ఏమనుకోక. నువ్వు వెళ్ళు" అన్నాడు ఆయన ఉబ్బి పోతూ. ప్రిన్సిపాలుకు భోజనం మీద అంత ఆసక్తి లేదు కానీ మందు పార్టీ అంటే పడి ఛస్తాడు. ఆయన్ని అప్పుడప్పుడూ బారుకు తీసుకెళ్ళి సత్కరిస్తూనే ఉంటాడు పరాంకుశం. కనుక భోజనపు ఆహ్వానం నీరసమనిపించినా, పరాంకుశం మాటలు తనకు సబ్బు పూసేవని ఆయన భావించలేదు.

అంతలో గంటకొట్టటంతో, క్లాసురూంలోకి వెళ్ళి, తన పుస్తకాలు తీసుకుని, ప్రిన్సిపాల్‌తో కబుర్లు చెప్తూ, స్టాఫ్‌రూం వైపుగా అడుగులేశాడు పరాంకుశం. ఇంక ప్రత్యేకంగా మర్నాడు తనకు శలవ కావాలని ప్రిన్సిపాల్‌ను అడగాల్సిన అవసరం లేక పోయింది పరాంకుశానికి.

అయితే, పరాంకుశం బావ, అక్కల మధ్యకూడ అతన్ని పిలవటం విషయంలో కొంత చర్చ జరిగింది.

"వద్దులే, వాడెందుకు? మనం చాలు..." అంది అరుంధతి.

"మేనకోడలి పెళ్ళిచూపులకు పిలవలేదని మనసు కష్టపెట్టుకోవచ్చు అతను. పిలుద్దాం" అన్నాడు రామానుజం.

"నేనెందుకు చెప్తున్నానో విన్పించుకోండి."

"అదేం మాట! మనం ఇన్నేళ్ళూ ఫారెన్‌లో వుండి వచ్చాం. పరిస్థితులెలా ఉన్నాయో, రీతి రివాజు లేమిటో తెలిసిన మనవాడొకడుంటే మంచిది కదా? అయినా పిల్ల మేనమామ కామాత్రం బాధ్యత లేదూ? పిలవకపోతే బావుండదు" అన్నాడతను.

"వాడి కసలే జిహ్వా చాపల్యమెక్కువ! తరవాత అనుకుని ప్రయోజనమేం" అందామె, తప్పక.

"పాపం! నోరు అదుపులో పెట్టుకో లేదు. రెండు స్వీట్లెక్కువ తింటే నష్టమేమిటి? మీతమ్ముడి జఠర శక్తికి సంతోషించాల్సింది పోయి ఇదేం గోలోయ్!" అని భార్య మాట కొట్టిపారేశాడు రామానుజం.

పాపం అరుంధతి కూడా అంత కంటే ఎక్కువ చెప్పలేక పోయింది. పుట్టింటి మమకారం ఆమె నోటిని కుట్టేసింది. రెండు స్వీట్లెక్కువ తింటే నష్టమేం లేదు. పైగా తన మొగుడు బావమరది పేరు మీద ఒకటి, రెండు జోకులు పేలేఅవకాశం కూడా వుంటుంది. ఇలా ఇంత మధన పడటం అయ్యాక పరాంకుశానికి ఫోనుచేయ్యటం జరిగింది.

+ + +

మర్నాడు పరాంకుశం అక్క ఇంటికి పది గంటలకల్లా వచ్చాడు. పది గంటలకల్లా భోజనం చేసి కాలేజీకి వెళ్ళే అలవాటు పరాంకుశానికి. రామానుజానికి భోజనం తొందరలేదు. అరుంధతికి తెల్సు తమ్ముడి సంగతి. పన్నెండయ్యేటప్పటికల్లా నకనకలాడి పోతాడు. వెళ్ళంగానే వంటింట్లో పీట వాల్చుకు కూర్చుని కబుర్లు చెప్పటం సాగించాడు.

"అవును. మరదలేదీ?" అనడిగింది అతని అక్క.

"ఆదొక పట్నాన తెమిలి ఛస్తుందిటే? అందుకే వద్దని చెప్పాను. పెళ్ళి చూపులేకదా? సెలవ ఎలాగో పెట్టేశా కదా అని ఓ పావుగంట ఎక్కువసేపు పూజలో కూర్చున్నా. పేపరు చదవకుండా ఇంటి బయటి గుమ్మం దాటి పోగూడదని శపథం చేశాను. ప్రపంచం ఎలా నడుస్తోందో తెలుసుకోకపోతే ఎలా? ఏ రోజు పేపరు ఆరోజు చదవకపోతే చద్దికంపుకొట్టినట్టుండి మర్నాటికి ఆ పేపరు చూస్తే కడుపులో దేవి నట్టుంటుంది. అందుకే ఏ రోజు పేపరు ఆ రోజు శ్రద్ధగా చదువుతాను. అసలు పేపరు చదవకుండా బావగారు ఎలా బతికేస్తున్నాడో నాకంతుపట్టని ప్రహేళిక! ఆ పైన పదిగంటల కల్లా నాకు కడుపులో కరకరమంటుంది. రోజూ అలవాటుకదే! మంచి ఆకలి ఆరోగ్యానికి చిహ్నం. కనుకనే ఆకలయ్యాక మాత్రమే నేను భోజనం చేస్తాను. ఓ సారి ఏమయిందంటే, మా కనకసుందరరావు వాళ్ళ ఇంటికి, నల్గొండ వెళ్ళాను......"

"కనకసుందరరావంటే మీ బావమరదే కదురా?" అరుంధతి అడిగింది.

"అవును. ఇంటికెళ్ళానా? పలకరించడు. పైగా ఇంటి అల్లుణ్ణా, గౌరవాల సంగతలావుంచు, నోరు తెరిచి మాట్లాడితే ఒట్టు. వెళ్ళంగానే, 'ఎట్లా ఉన్నారు? సరళ, పిల్లలు బావున్నారా?' అంతే, ఇంక మర్యాదలయిపోయినట్లే! నలభయ్యేళ్ళొచ్చాయి. కోర్టులోపని చేస్తున్నాడు. లంచాలు పట్టటానికయినా నోరు తెరవడా? ఆ వ్యవహారంలో ఘనాపాటీ అని విన్నాలే. అసలా కొత్తపల్లివారే అంటీముట్టనట్టుండే రకం. నాకు వాళ్ళింటికి వెళ్ళటమంటేనే తలనొప్పనుకో. తిరిగి వచ్చేటప్పుడు మా అత్తగారు సన్నాయినొక్కులు నొక్కుతూ, 'వాడికి మాట్లాడటం రాదు. నువ్వేమనుకోకు, నాయనా' అంది. 'వాడికి మాట్లాడటం రాదు, నీకు వంట రాదు' అనుకున్నాను. కనీసం అల్లుడింటి కొచ్చినప్పుడయినా విస్తట్లోకి నాలుగూ ఉండేట్టు చూసుకోవాలా? మా మావ 'కాస్తంత కూట్లోకి ససిగా చెయ్యవే' అని చెప్పి చెప్పి చచ్చాడు. ఈమె వంట మాత్రం అంతే..."

"మీ ఆవిడ బాగా చేస్తుందటరా?" అడిగింది అరుంధతి, పప్పులో పోపు పెడుతూ.

ఐదుగురు ఆడసంతానం మధ్య పరాకుశం ఒక్కడే మగ సంతానం. అందుకే అక్కలందరూ అతన్ని అపురూపంగా చూసుకుంటారు. అరుంధతి కూడ పొద్దున్నే లేచి

తమ్ముడు ఉండలేడని వంటమొదలెట్టి, అతని కిష్టమయినవన్నీ చేసింది. ఇంక కుక్కరు విజిలొస్తే భోజనం పెట్టేయటమే.

"ఆ తానులో గుడ్డకాదుటే. కాపురానికొచ్చాక, నా చాతనయిన ట్రయినింగు ఇచ్చాను. ఫర్లేదు. అమెరికానుండి వచ్చినప్పటి నుండి మిమ్మల్ని ఆహ్వానిస్తూనే ఉన్నాను. మీకు మా ఇంటికి రావటానికే తీరిక దొరకటం లేదు...."

అంతలో మేనకోడలు కీర్తి వచ్చి, "నేనూ, అన్నయ్యా షాపింగ్‌కి వెళ్తున్నాం, వస్తావా?" అని అడిగింది.

"నేను భోజనం చేస్తే గానీ ఎక్కడికీ కదలలేనమ్మాయి! అసలు భోజనం చెయ్యకుండా ఎక్కడికీ వెళ్ళకూడదు. ఆ విషయం ఎంతో ఆలోచించి నిర్ధారణ కొచ్చా" అని వెనక్కితిరిగి, "అవునూ, పిల్లేమయిందే?" అనడిగాడు పరాంకుశం.

"వెళ్ళిపోయింది లేరా! నువ్వు లే భోజనానికి" అంది అరుంధతి.

"బావగారు భోజనానికి లేవరా?"

"ఆయనోపట్టాన లేవరు. అయినా నువ్వొచ్చావుగా, పిలుస్తానుండు."

పదకొండు గంటలయింది. అంత పొద్దున్నే భోజనం చెయ్యాలంటే నోటికెక్కదు రామానుజానికి. అయినా బావ మరది వచ్చాడు కనుక మొహమాటానికి అతనితో పాటు భోజనానికొచ్చాడు. పరాంకుశం లేచి లుంగీ కట్టుకుని, బాత్‌రూంలోకి వెళ్ళి ముఖం, కాళ్ళూచేతులూ కడుక్కుని వచ్చి డైనింగ్ టేబిల్ నలంకరించాడు.

పరాంకుశానికి మాట్లాడే ఉద్యోగం కనుక ఇబ్బంది లేక పోయింది. వేరే ఉద్యోగమయితే చచ్చే చావయేది. భోజనం చేస్తూ కూడా మాట్లాడటం ఆపలేదు. ఔపోసన పట్టి, నిష్ఠగా కళ్ళు మూసుకుని గాయత్రీ మంత్రం జపించి, రెండు మెతుకులు కతికాక, "నాన్న 'మితాహారం, మితభోజనం, మితమైన నిద్ర మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంద'నేవాడు. ఆయన మాటలయితే నాకు శిరోధార్యమే ననుకో. అయితే యేం? 'హ్రీరమ్యుం జెడుగాగ, శుచిన్ దంభిగా...' అంటూ మన మంచి గుణాలను వక్రీకరిస్తూంటుంది ప్రపంచం...."

"చాల్లేవయ్యా! భోజనం కానిచ్చి మాట్లాడుకోవచ్చు మీ అక్కా తమ్ముళ్ళు గంటల తరబడి" అన్నాడు రామానుజం.

"అదేం మనిషో, మీ బావగారికి షుగరు కదా? ఆకలేవెయ్యదు" అంది అరుంధతి.

"ఈ విషయం గురించి కూడ నేను ఆలోచన చేశాను. డయాబిటిస్ ఎందుకొస్తుందో అని సుదీర్ఘ చింతన చేశాక, ఓ కంక్లూజన్ కొచ్చేశాను" అని "నువ్వు కూడా కూర్చోవే,

అక్కా! పిట్ట తిండి మనిషి రెండు ముద్దలు తినేసి ఐపోయిందని లేచేస్తాడు. నా కలా తింటే తిన్నట్టే ఉండదు. ఆలాతినటం మనం భోజనం పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించటమవుతుందని, అది తీవ్ర భగవదపచారమనీ నా అభిప్రాయం. సరే, ఆయన మన అభిప్రాయం ప్రకారం ఎలాగో నడచుకోడు కనుక, నువ్వయినా కూర్చునుంటే, నాకు సంతోషంగా ఉంటుంది. ఆఁ, నేను డయాబిటీస్ గురించి సుదీర్ఘ చింతన చేశాక, ఓ కంక్లూజన్ కొచ్చేశానని చెప్పాను కదా! విషయమేమిటంటే...."

"ముందు తినవయ్యా తరువాత మాట్లాడుకోవచ్చు" అన్నాడు రామనుజం, మజ్జిగ పోయించుకుంటూ.

"ఇదే అసలు విషయం అక్కా! సుష్టుగా భోజనం చేయకపోవటం వల్లే బావగారి షుగర్ వ్యాధికి కారణం.... ఆ ఉప్పిలా పెట్టు. పనసపొట్టు కూరలో ఉప్పు కావలిసినంత పడకపోతే రుచి రాదే!" అని ఉప్పు కలుపుకుని, ఓ ముద్ద రుచి చూశాక, "ఆఁ ఇప్పుడు బాగుంది. మరికొంచెం ఆవపెట్టినట్లయితే బాగుండేదే! బావగారికి డయాబిటీస్ వచ్చాక, నీ వంట పాడయింది. బిపి కనుక ఉప్పుండకూడదు. షుగరు కనుక చక్కగా చెక్కెరేసుకుని పప్పుచారు పెట్టుకోటానికి వీలు లేదు- అందర్లా నేను సాంబారనను. మన పప్పుచారు, పులుసు ఉండగా అరవ్వాళ్ళ సాంబారు మనమెందుకు అరువు తెచ్చుకోవాలి. కనుక, అనవసరంగా అరవ సంస్కృతిని ప్రతిబింబించే మాటలేవీ నేను ఉపయోగించను. అందుకు మినహాయింపు పాశ్చాత్య సంస్కృతి. నిజానికి ఇంగ్లీషువాళ్ళు ఎంత గొప్పవాళ్ళే అక్కా! యాభై యేండ్లలో దేశమంతటా రైలు లైనులను నిర్మించారు. స్వతంత్రం వచ్చాక, బీబీనగర్ నుండి నడికూడికి రైలు లైను వెయ్యటానికి మనకు యాభైయేండ్లు పట్టింది. కనుక చెప్పొచ్చేదేమిటంటే, మనం ఇంగ్లీషువాళ్ళను వెళ్ళగొట్టి, దిద్దుకోలేని తప్పుచేశాం. బావగారు అంత సైంటిస్టు ఎలా అవగలిగాడు- అమెరికా వెళ్ళబట్టే కదా?...."

అక్క ఏదో చెప్పబోతే, "మధ్యలో అడ్డురాకు! ఆలోచనా ప్రవాహానికి అడ్డు పడటం దేశద్రోహమంత నేరం! చెప్పొచ్చేదేమిటంటే.......మామిడికాయల్లో పులుపుండటం లేదే.మన చిన్నప్పుడు అమ్మ మామిడికాయ పప్పు చేస్తే ఎంత బావుండేది! ఆ రోజులే వేరు. అప్పటి పదార్థాలు ఇప్పుడు దొరకవు. అన్నీ సూపర్ పంటలే కదా!... పప్పులో కొంచెం కారం వేస్తే బాగుండేదేమో ననుకుంటా! బావగారికి పడదు కదా! పాపం నువ్వు మాత్రం ఏం చేస్తావు లే!..."

"ముందు భోం చెయ్యి. తర్వాత మాట్లాడుకోవచ్చు" అని కసిరింది అరుంధతి తమ్ముణ్ణి.

"పిట్ట తిండి మనిషి తినేసి కూర్చుని వీళ్ళేం బకాసురులా అని మనకేసి చూస్తుంటే మనకేం తిండిలోపలకు పోతుందే?....!"

"తినవయ్యా, బాబూ! అదృష్టవంతుడివి! వృకోదరుడికున్నంత జఠరాగ్ని పెట్టాడు నీకు దేవుఁడు! మీరు తింటానికి పుట్టినవాళ్ళు, మేం, పిట్టమెతుకులవాళ్ళం, బతకటానికి తింటాం. అవునూ, కీర్తి, సుధాంశులు షాపింగ్ అంటూ బయటికెళ్ళిన వాళ్ళు ఇంకా రాలేదే!" అన్నాడు రామానుజం.

"ఇంతకు ముందేగా వెళ్ళారు. వస్తారులేండి" అంది అరుంధతి.

"అసలు పెళ్ళి చూపులు పెట్టుకుని షాపింగంటూ బయటికి పోకపోతేనేమే? ఇలా పిల్లమూక షాపింగులంటూవెళ్తుంటారని నాకు తెల్సు. నేనా విషయం పొద్దునే ఫోనుచేసి చెబ్దామనుకునిమర్చిపోయా. వెధవది, ఎన్ని విషయాలని గుర్తుంచుకోను. అక్కడకీ గుర్తు చెయ్యమని మీ మరదలికి చెప్తూనే ఉంటా! మతిమరుపు మనిషి! 'మీ మాటల్లో నేనన్నీ మరచిపోతుంటా! మాట్లాడొద్దంటే మీరు వినరు!' అంటుంది. అసలు అతిగామాట్లాడటం మన వంశంలోనే లేదుకదా, అక్కా! చెప్పొచ్చేదేమిటంటే...వంకాయ పచ్చడి ఎండు మెరపకాయలతో కాకుండా, పచ్చి మిర్చితో చేస్తే బాగుండేది. పచ్చిమెరపకాయ రుచే వేరు...."

అలా అప్రతిహతంగా మాట్లాడుతూ, పరాంకుశానికి భోజన హింసా కార్యక్రమాన్ని పూర్తి చేసి లేచేటప్పటికి ఒంటి గంటయింది. రామానుజం ఓ కునుకు తీసి లేచాడు. అరుంధతి భోజనం పూర్తి చేసి, వంట ఇల్లు సర్ది, తమ్ముడు ఏమన్నా అనుకుని పోగలడని డైనింగ్ టేబుల్ ముందు, అతడి మాటలు వింటూ కూర్చుంది. అంతలో కీర్తి, సుధాంశు లు వచ్చి, అన్నం కూడ తినేశారు.

భోజన మయ్యాక, "అక్కా, ఓ అరగంట పడుకుని లేస్తానే!" అని వెళ్ళి మంచం మీద పడుకుని కళ్ళు మూసుకున్నాడో లేదో, గాఢ నిద్రలోకి జారుకు పోయాడు పరాంకుశం.

నాలుగున్నరకు పెళ్ళివారు వచ్చారు. అప్పుడు సుధాంశుడు వెళ్ళి మామను లేపితేగానీ లేవ లేదు.

పరాంకుశం బద్ధకంగా ఒళ్ళు విరచుకుంటూ లేచి కూర్చుంటూ, "ఏమిట్రా, మంచి నిద్ర చెడగొట్టావు?" అన్నాడు.

"దె హేవ్ కమ్. మమ్ సేస్ యు హవ్ టు గెటప్ ఎండ్ ఎంగేజ్ దెం" అన్నాడు సుధాంశుడు.

"ఏమిటో, నీ భాష నాకెప్పుడూ అర్థమయి చావదు. అన్నేళ్ళు మన దేశం పాలించిన వాళ్ళు తెలుగు నేర్చుకుని, ఇంగ్లీషుకు బదులు వాడుకోవాల్సింది. శ్రీ కృష్ణ దేవరాయలు చెప్పలా- దేశభాషలందు తెలుగు లెస్స- అని."

'హు సెడ్ వాట్? అండ్ టెల్గూ ఇంటర్నేషనల్ లాంగ్వేజ్! ఇంపాజిబుల్!"

"ఏందిరా ఇంపాజిబుల్? ఏఁవీ లేని ఇంగ్లీషు కాంగా లేంది, తెలుగెందుకు కాదు. సరే, 'ఆవకాయ' కు ఇంగ్లీషేంటో చెప్పు, తెలిస్తే?"

"మాంగో పికిల్."

"మాంగో పికిల్!" పడిపడి నవ్వాడు పరాంకుశం. "మరి మాగాయ నేమంటారు, మెంతికాయ నేమంటారు, తురుము పచ్చడి నేమంటారు, తొక్కుడు పచ్చడి నేమంటారు?" మామ కెలా సమాధానం చెప్పాలో తెలియక తికమక పడిపోయాడు సుధాంశుడు.

"ఐ డోంట్ నో, అంకుల్!" అన్నాడు.

"చూశావా! ఇంగ్లీషులోని భాషా దారిద్ర్యం! మేనమామకూ అంకులే, పెత్తండ్రి, పినతండ్రులకూ అంకులే! ఏం భాష రా బాబూ?"

"మరి ఫాదరిన్లాకీ మామే, మెటర్నల్ అంకుల్‌కీ మామే. ఇదెక్కడి న్యాయం, మామాశ్రీ?" అంది అప్పుడే అటుగా వచ్చిన మేనకోడలు కీర్తి. అన్నంత 'పూర్' కాదు, ఆ పిల్ల తెలుగులో.

"దానికి పెద్ద ఆర్గ్యుమెంటు వుందిలే. ఇప్పుడు తీరిక లేదు. ఆ విషయం నేను మళ్ళా వచ్చినప్పుడు గుర్తుచెయ్యి. అప్పుడు డిస్కస్ చేద్దాం" అని లేచాడు పరాంకుశం.

అతడు మొహం కడుక్కుని, డ్రస్సు మార్చుకుని, ముందు హాల్లోకి వచ్చేటప్పటికి రామానుజం పెళ్ళివారితో మాట్లాడుతున్నాడు. పెళ్ళికొడుకు, తండ్రి, తల్లి వచ్చారు. బావ మరదిని చూసి పెళ్ళివారికి పరిచయం చేశాడు రామానుజం. ఇంక వాళ్ళతో మాట్లాడే భారం తన భుజస్కంధాల మీద వేసుకున్నాడు పరాంకుశం. పిల్లవాడు సాఫ్ట్‌వేర్ ఇంజనీరట! ఇండియాలోనే పని చేస్తున్నాడట! తండ్రి ఇరిగేషన్ డిపార్ట్‌మెంటులో డిప్యూటీ ఇంజనీరు. అంతలో పెళ్ళికూతురు, ఆమె వెంట ఫలాహారాలతో తల్లీ వచ్చారు. పిల్లవాడూ, పిల్లా చూసుకున్నారు. పరాంకుశానికి పిల్లవాడు నచ్చలేదు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరయినవాడు ఇండియాలో పని చెయ్యటమేమిటి? ఏ పెళ్ళికొడుకయినా కట్నం వద్దంటే అతడిలో ఏదో లోపం ఉంది అని అనుమానించే బాపతు మనిషి పరాంకుశం. పెళ్ళికొడుకు ఇండియాలో పని చెయ్యటానికి కూడా అలాంటి లోపమేదో ఉండి ఉండాలి అని నిర్ధారించుకున్నాడతను. అంతే, అతని పట్ల విరసం కలిగింది అతనికి. అయితే, అతనికి మాట్లాడటానికి సమయం లేక పోయింది. అక్క ప్లేటు నిండా స్వీట్లూ, మామిడి పండు ముక్కలూ, కారా పట్టుకొచ్చి అతనికి కూడా ఇచ్చింది. అతనికి ప్రపంచంలో తిండి పదార్థాల తరువాతే ఏదయినా. క్షణంలో ప్లేటు పూర్తి చేశాక పెళ్ళివారి వంక దృష్టి మరల్చాడు.

"ఏంవిటో నండి, ఈ రోజుల్లో అందరూ ఇంజనీరింగ్ చేసేవాళ్ళే! తల్లి దండ్రులకు కూడ ఇదో పెద్ద జాడ్యమైపోయింది. తమ కొడుకుని, కూతుర్ని ఇంజనీరింగ్ చేయించాలన్న ఆరాటం తప్పితే, సదరు పిల్లవాడు/పిల్ల ఆశలు, ఆశయాలేమిటి, వాళ్ళేం చెయ్యాలను కుంటున్నారు అన్న ఆలోచనే ఉండటం లేదు. నాకీ వ్యవహారం నచ్చదండీ! ముందు పిల్లలు ఏం చదవదల్చుకున్నారో తెలుసుకున్నాక వాళ్ళని ఆ కోర్సులో ప్రవేశ పెట్టాలి. అంతేగానీ గుడ్డెద్దు చేలోపడ్డట్టు అందరూ చదివిస్తున్నారుకదా అని మనమూ చదివించ కూడదు...."

"మీకెంత మంది పిల్లలు?" అడిగాడు వరుడి తండ్రి రామదాసు

"ఐదుగురు. ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు. నేను ఫామిలీ ప్లానింగ్ లాంటి వాటికి విరుద్ధం. ఇచ్చేది దేవుఁడు. వద్దనటానికి మనమెవరం? ఈ కాలంలో నా మాటలు మీకు ఎబ్బెట్టుగా అన్పించవచ్చు. కానీ నేను ఇతర్ల అభిప్రాయాల ప్రకారం నడుచుకునే మనిషిని కాను. దేవుఁడు మనకు బుర్రెందుకిచ్చాడు? మన ఆలోచనలు మనంచేసుకోటానికి. అంతేగానీ ఇతర్లని గుడ్డిగా అనుకరించటానికి కాదు. ఎవరేమనుకున్నా సరే, నా అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్టు చెప్పేస్తాను. ఎవరో ఏదో అనుకుని పోతారని మాత్రం జంకను. అందువల్ల కొంతమందికి కష్టం కలగవచ్చు. కానీ, మనసులో ఒకటి పెట్టుకుని పైకొకటి మాట్లాడటం కంటే అది నయం కదండీ!..."

"మీ పిల్లలేం చదువుతున్నారు?"

"పెద్దవాడు ట్రిపుల్ ఇ ఫైనల్ ఇయర్‌లో ఉన్నాడు. 'మీరూ అదే పని చేస్తున్నారుగా?' అని మీరనవచ్చు. కానీ, సంసారం అన్నాక అందరి ఆలోచనల ప్రకారం పోవాలి కదా? మా ఆవిడ పెద్దవాడిని ఇంజనీరు చెయ్యాలని పట్టుబట్టింది. కొంపలో శాంతి కోరుకునేవాడికెవడికయినా పెళ్ళాం మాట వినక తప్పదు. కానీ మా పెద్దమ్మాయి విషయంలో నా ఆశయాలను అమలు పర్చ గలిగాను. దానికి అకౌంటెన్సీ అంటే ఇష్టం. 'బికాం చదువుతా, నాన్నా!' అంది. 'ఓకే, అమ్మడూ, నీ ఇష్టం' అన్నా. మిగతావాళ్ళు చిన్న క్లాసుల్లో ఉన్నారు."

"వాళ్ళని టిఫెను తీసుకోనివ్వయ్యా, పరాంకుశం!" అని రామానుజం బావమరదికి వాక్ ప్రవాహానికి అడ్డువచ్చాడు.

అప్పుడు గమనించాడు పరాంకుశం. వాళ్ళ ప్లేట్లు పెట్టినవి పెట్టినట్టుగానే ఉన్నాయి. ముగ్గురిలో ఏవరూ ఏమీముట్టుకోలేదు.

"ఏమిటీ, రామదాసుగారూ, మొహమాట పడుతున్నారు? తీసుకోండి. బందరు లడ్డు మా బావగారు మీకోసం ప్రత్యేకంగా తెప్పించారు" అన్నాడు పరాంకుశం.

రామదాసు గారు నవ్వాడు కానీ తిన లేదు.

"ఏంవిటీ, షుగరా? ఏం ఫర్లేదు. ఎప్పుడో ఓసారి తినవచ్చు" అని పరాంకుశం ప్రోత్సహించాడు కానీ ప్రయోజనం లేక పోయింది. అతని భార్యకూడా ముట్టుకోక పోవటం చూసి, "ఏంవిటీ, మీక్కూడా షుగరా? పోనీ కారా తీసుకోవచ్చుగా? నీ కేమయిందయ్యా, బాబూ, నువ్వూ ముట్టుకోలేదు. బయట కుర్రకారు జంక్‌ఫుడ్ ఎంజాయ్ చేస్తూనే ఉంటారుగా?" అన్నాడు పరాంకుశం.

అతనూ తండ్రి లాగా ఓ చిరునవ్వు చిందించాడు కానీ మాట్లాడలేదు.

"కతికితే అతకదు లెండి" అంది అతని తల్లి.

ఆమె మాత్రం మొహం ముడుచుకుని ఉంది. ఆవిడ సరుకున్న మనిషిలా కన్పించింది పరాంకుశానికి. కోడల్ని సతాయించే అత్తగారిలా కన్పించింది. 'ఇంక తనూరుకుంటే మేనకోడలికి అన్యాయం చేసినట్టే'నని భావించాడు పరాంకుశం.

"ఓ సారేమయిందంటే మా స్నేహితుడొకాయన ఇలాగే తన కొడుకు పెళ్ళి చూపులకు నన్ను కూడ పట్టుకెళ్ళాడు. 'నేనెందుకండీ, బాబూ?' అన్నా విన్పించుకోలేదు. నేను లేకపోతే మా మిత్రులెవరూ శుభకార్యాలు పెట్టుకోరు. సరే, అలా పెళ్ళి చూపులకెళ్ళామా? రంగనాథం, అతని భార్య అలివేలుకు షుగరు వ్యాధి ఉంది. వాళ్ళూ మీలాగే పెళ్ళివారు పెట్టిన స్వీట్లు ముట్టుకో లేదు. నేను ముందే చెప్పాను: 'పెళ్ళివారు స్వీట్లూ వగైరా పెడితే, మాకు డయబెటిస్ అని చెప్పి, మీ రోగాన్ని గురించి చాటింపేసుకోవాల్సిన పని లేదు. శుభ్రంగా తినేయండి. ఒక్క రోజు తింటే మునిగి పోయేదేంలేదు' అని. 'తప్పు. మనకున్న రోగాన్ని దాచుకోటం తప్పు. రేప్పొద్దున మీకు డయబెటిస్ వ్యాధి ఉన్న విషయం చెప్పలేదు. అని వాళ్ళంటే మనం మొహమెక్కడ పెట్టుకుంటాం? చెప్పకుండా మమ్మల్ని మోసం చేశారని వాళ్ళంటే బాగుండదు' అన్నాడు. 'పెళ్ళి నీ కొడుక్కు గానీ, నీక్కాదు కదురా?' అన్నా. 'అయితే మాత్రం మీ డయబెటిస్ మీ అబ్బాయిక్కూడారావచ్చుగా అని వాళ్ళనొచ్చుగా?' అన్నాడు. అంతటి నిక్కచ్చి మనిషి మా రంగనాథం. ఇలాగే అప్పుడూ వేసవి కాలం. మంచి బంగినపల్లి మామిడి పళ్ళు ముక్కలు కోసి ప్లేట్లలో పట్టుకొచ్చారు. నేను ఎదుటి మనుషులు ఏమనుకుంటారో నని మొహమాటం పడే మనిషిని కాను. నేను ప్లేటు ఖాళీ చేశాను కానీ రంగనాథం, అలివేలూ ముట్టుకోలేదనుకోండి. ప్లేట్లలా అభుక్తంగా ఉండటం చూసి నా మనసు ఉసూరుమంది. నేను చెప్పినా విన్పించుకోలేదు. అంత

మంచివాళ్లను పట్టుకుని ఆ పిల్ల మేనమామట, అతడు 'సర్టిఫికెట్టు పట్టు కొచ్చారా? పట్టుకొస్తే చూపించండి' అని అడిగాడు..."

"ఏం సర్టిఫికేట్! పిల్లవాడి క్వాలిఫికేషన్ గురించా?" అనడిగాడు రామదాసు.

"కాదండీ బాబూ! ఆ సర్టిఫికేట్ ఏఁవిటా అని నేనూ తల పట్టుకు కూర్చున్నానంటే నమ్మండి."

"మరి?!"

"పిల్లవాడికి ఎయిడ్స్ వ్యాధి లేదని డాక్టరు సర్టిఫికేట్ కావాలంట! మా రంగనాథానికి కోపం వచ్చింది. మనిషితోకతొక్కిన తాచులా లేచాడు, 'మమ్మల్ని అవమానం చేస్తున్నారం'టూ.. 'ఇదెక్కడయిన మన సంప్రదాయంలో ఉందా? పిల్చి అవమానించటం కాదా ఇది, నువ్వు చెప్పు, పరాంకుశం! నువ్వు న్యాయమయిన మనిషివి!' అన్నాడు. వాడిని శాంతపరిచేటప్పటికి నా పురమారిందనుకోండి. 'లేదురా బాబూ! తప్పు, మనమలా అనుకోటం తప్పు. రోజులలా ఉన్నాయి'అని వాడికి శతవిధాల నచ్చ చెప్ప చూశాను కానీ వాడు వింటేనా? చివరకు కోపంతో వాళ్ళకు చెప్పకుండా కూడా నాచెయ్యి పట్టుకు లాక్కు వచ్చాడు. కొంతమంది మనుషులంతే! కాస్తంత సేపు మనసు పెట్టి ఆలోచిస్తే ఆడపిల్ల వారి బాధకూడ మా రంగనాథానికీ అర్థమై ఉండేది. ఆ ఓర్పు వాడికి లేక పోయింది. సపోజ్ అలా నేనూ మిమ్మల్ని అడుగుతా ననుకోండి. మీరలా కోపగించుకుంటారా? మీరలాంటి పని ఎప్పుడూ చేయరు. మీ సంగతి నాకు తెలీదూ?..."అని తన వాగ్ధాటిని ప్రదర్శిస్తున్న పరాంకుశం, అక్క గుడ్లురిమి చూస్తుండటంతో తెల్లబోయాడు.

"ఏవిటే అక్కా, పెళ్ళివారేమిటీ, అలా వెళ్ళిపోతున్నారు?"

"నీ నిర్వాకం, జిహ్వాచాపల్యం! మేం ఆ సర్టిఫికెట్ నిన్నడగమన్నామట్రా? మంచి సంబంధం తగలెట్టావు! మీ బావ గారిక్కూడా కోపమొచ్చింది నీ వాగుడు చూసి."

"బోడి గొప్ప సంబంధం! ఇండియాలో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీరు సంబంధమూ గొప్ప సంబంధమే! ఇట్టాంటి అణాకానీ సంబంధాలు ఇన్ని తీసుకొస్తాను, రేపీపాటికి!" అంటూ తన తలమీద వెంట్రుకలు చూపాడు పరాంకుశం."నీ కెందుకు దీన్ని తలదన్నే సంబంధం తీసుకురాకపోతే నేను నీ తమ్ముణ్ణే కాదనుకో" అనీ భరోసా ఇచ్చాడు.

"వద్దులే, నాయనా, మమ్మల్నిట్టా బతకనీ" అంటూ కూతుర్ని తీసుకుని లోపలకు పోయింది అరుంధతి.

"దె ఆర్ కల్చర్డ్ పీపుల్! దె డింట్ రిటాలియేట్ యు బై డిమాండింగ్ ఎ వర్జినిటీ టెస్ట్ సర్టిఫికేట్, ఏజ్ యు అనెంబ్రాసింగ్‌లీ డిమాండెడ్ ఫ్రం దెం, అంకుల్!" అన్నాడు సుధాంశుడు.

బావగారు కూడా తనతో మాట్లాడకుండా లోపలకు వెళ్ళిపోవటంతో పరాంకుశానికి దిగులేసింది. పెళ్ళివారు ముట్టుకోకుండా వదిలి పెట్టి వెళ్ళిన ప్లేట్లలోని స్వీట్లు, మామిడి ముక్కటూ తింటూ, తనేం తప్పు చేశానా అన్న విచికిత్సలో పడి పోయాడు అతను. 'మేనకోడలి భవిష్యత్తు గురించి తనంత జాగ్రత్త తీసుకుంటే తన అక్కకూ, బావకూ చేదయిపోయింది. మేనమామగా తనకామాత్రం బాధ్యత లేదూ? తను అన్నదాంట్లో మాత్రం తప్పేం ఉంది! సర్టిఫికెట్ తీసుకురమ్మన్నాడు. ఈ కాలం కుర్రకారుని నమ్మలేం! మొహమాటపడి ప్రాణాలకు తెచ్చుకోలేంగా? ఇవాళ కోపగించుకున్నవాళ్ళు రేపు నేను చేసిన మేలు తలుచుకుని సంతోషిస్తారు. అయినా ఇండియాలో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీరు సంబంధం కూడ ఓ సంబంధమే! ఎవరేమనుకోనీ, తన బాధ్యత నిర్వహించిన తృప్తి మాత్రం తనకుంది. ఆ అత్తగారు కూడ తక్కువదిగా లేదు. కొడుకుని సంసారం చేయనిచ్చే మనిషిలా లేదు. తండ్రి ఇర్రిగేషను డిపార్టమెంటులో ఉద్యోగం చేస్తున్నాడంటే మహా లంచగొండే అయి ఉండాలి!' అనుకున్నాడతను.

ఇంటికి వెళ్ళాక అతని భార్య అడిగింది పెళ్ళి సంబంధం విషయం. అతను చెప్పింది విన్నాక, "నేను మీరు రమ్మన్నా రాని దండుకే. మీరేదో ఓ పెటకం పెట్టకుండా ఉండరు. తిండియావ ఎక్కువయినా భరించగలను కానీ మీ అతి వాగుడు సహించలేక పోతున్నాను. ఇంత జిహ్వా చాపల్యం ఉన్న మనిషివి నా అదృష్టం కొద్దీ నాకు దొరికావు!" అంది ఆమె నెత్తి బాదుకుంటూ.

"ఎవరేమనుకున్నా నేను లెక్క చెయ్యను, నా బాధ్యతను మరచి ప్రవర్తించను" అన్నాడు పరాంకుశం ధృఢంగా.

అయితే, అందరూ అనుకున్నట్టు ఆ సంబంధం చెడిపోలేదు. ఆ పిల్లవాడు ఎంయస్ చెయ్యటానికి అమెరికా వెళ్ళినపుడే అతనూ, కీర్తీ ప్రేమించుకున్నారు. ఈ పెళ్ళి చూపులు లాంఛనం మాత్రమే. పెళ్ళికొడుకు తల్లిదండ్రులను కలుసుకోవటం కోసమే. మేనమామ భుజాన వేసుకుని తన బాధ్యత నిర్వహించినందువల్ల ఆ పెళ్ళి జరక్కుండా పోలేదు.

ఆ విషయం అక్క చెప్పినప్పుడు, "అయితే, సర్టిఫికెట్ లేకుండానే చేసుకుంటున్నారటే!" అని అడిగాడు.

"నీ మొహం! ముగ్గురు కూతుళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యాల్సినవాడివి! ఇట్లా పిచ్చి వాగుడు వాగి వాళ్ళ పెళ్ళిళ్ళు కాకుండా చేసేవు. తరవాత నీ ఏడానబడి ఏడవాల్సి వస్తుంది వాళ్ళకు!" అంది అరుంధతి.

పెళ్ళిలో కలిసిన పరాంకుశంతో పెళ్ళి కొడుకన్నాడు:

"మీలాంటి వాళ్ళు చాల అరుదు. మనసులోని ఆలోచనని దాచుకోకుండా బయటకు కక్కెయ్యగల మనుషులెంతమంది ఈ లోకంలో? యువార్ ఏన్ ఎక్సెప్‌క్షన్! ఆ భోజన ప్రియత్వం, ఆ ప్రవాహ సదృశమయిన వాగ్ధాటి! ఒహో, మీకు మీరే సాటి! నిజం చెప్పాలంటే నేను మీకు ఏకలవ్య శిష్యుడనై పోయానంటే నమ్మండి. ఐ లైక్ యు వెరీమచ్. భోజనం విషయంలో నాకెన్నో సందేహాలున్నాయి. వాటిని గురించి మీతో నేను తీరుబాటుగా చర్చిస్తాను" అని.

పెళ్ళికొడుకు మాటల్లో నిజమెంతో తేల్చుకోలేక పోయాడు పరాంకుశం. పక్కనే నిలబడి ఆ మాటలు వింటున్న రామానుజం, అరుంధతి గాబరా పడిపోయారు.

"మీ తమ్ముడితోనే వేగలేకుండా ఉంటే, ఇప్పుడు అల్లుడు కూడా అలా తయారవుతాడేమోనని భయంగా ఉంది" అన్నాడు రామానుజం ఆ తర్వాత భార్యతో. "పైగా తెలుగు కూడ స్వచ్ఛంగా, సమాసయుక్తంగా మాట్లాడుతున్నాడు!"

"భోజనం విషయంలో కూడ ఎన్నో సందేహాలున్నాయిట!" అంది ఆమె, దిగులు పడిపోతూ.

నది మాసపత్రిక. జులై, 2012